క్లుప్తంగా

రేపు పాతకొట్టాం వెంకన్న ఆలయంలో పూజలు

కోటనందూరు: తిరుమల ప్రతిష్టను మంట కలిపిన చంద్రబాబు పాపాలు తొలగిపోవాలని ఆలయాల్లో పూజలు చేయాలని మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చినపిలుపు మేరకు శనివారం పాతకొట్టాం వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేయనున్నట్టు ఎంపీపీ లగుడు శ్రీనివాసు గురువారం తెలిపారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి దాడిశెట్టి రాజా, వైఎస్సార్ సీపీ నాయకులు యనమల కృష్ణుడు ముఖ్య అతిథులుగా హాజరు కానున్నారన్నారు. మండలంలోని వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని ఎంపీపీ కోరారు.

250 మందికి వైద్యపరీక్షలు

గండేపల్లి: ఆదిత్య యూనివర్సిటీ, రాజమహేంద్రవరం డెల్టా హాస్పిటల్ ఆధ్వర్యంలో గురువారం మల్లేపల్లి జెడ్పీ స్కూల్లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించినట్టు ప్రిన్సిపాల్ డి.సతీష్ కుమార్ తెలిపారు. సుమారు 250 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బలిరెడ్డి వరలక్ష్మి గంగరాజు, తదితరులు పాల్గొన్నారు.

నీలాద్రిరావుపేట పరిధిలో..

నీలాద్రిరావుపేట పరిధిలోని కార్తికేయ మల్టీస్పెషాల్టీ హాస్పిటల్లో గురువారం రోగులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. సుమారు 200 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేసినట్టు తెలిపారు.

రేపు మండల సమావేశం

తొండంగి: మండల పరిషత్ సర్వసభ్య సాధారణ సమావేశం శనివారం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో మార్కండేయరావు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో ఉదయం 10.30 గంటలకు ఎంపీపీ దడాల సువర్ణలత అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశానికి సంబంధిత అధికారులు, ఎంపీటీసీలు, కోఆప్షన్ సభ్యులు, సర్పంచులు హాజరుకావాలన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

గండేపల్లి: జెడ్ రాగంపేటలో వైఎస్సార్ సీపీ యువ నాయకులు తోట రాంజీ మృతుని కుటుంబాన్ని పరామర్శించారు. మాతృ వియోగంతో బాధపడుతున్న గ్రామానికి చెందిన పార్టీ నాయకుడు పాలచర్ల వెంకన్న చౌదరిని పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు. ఆయన వెంట ఎంపీపీ చలగళ్ల దొరబాబు, పార్టీ మండల అధ్యక్షుడు మద్దిపట్ల రామకృష్ణ, జేసీఎస్ మండల కన్వీనర్ తాళ్లూరి మధు, డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ రామకుర్తి మూర్తి, సర్పంచ్ ములంపాక సురేష్, పార్టీ అభిమానులు కందరిల్లి కామేష్ తదితరులు ఉన్నారు. అలాగే మల్లేపల్లిలో మాతృవియోగంతో బాధపడుతున్న రామకుర్తి బ్రహ్మాజీని పరామర్శించారు.

ఇంటింటికీ కరపత్రాలు

గోకవరం: రంపయర్రంపాలెం గ్రామంలో గురువారం మన మంచి ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, జనసేన ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ ముఖ్యఅతిథిలుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేసి స్టిక్కర్లు అంటించారు. అనంతరం గ్రామంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సుందరకాండ పారాయణ

జగ్గంపేట: స్థానిక యతిరాజ్ మండలి ఆధ్వర్యంలో గురువారం సుందరకాండ పారాయణం జరిగింది. జగ్గంపేట ఆర్యవైశ్య మహిళా సంఘ నేత కొత్త మాధురి ఆధ్వర్యంలో స్థానిక కొత్త కొండబాబు కాంప్లెక్స్‌లో ఈ కార్యక్రమం నిర్వహించారు. సుందరకాండ పారాయణలో 68 సర్గలు పఠనం చేసి స్వామి వారికి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘం నేతలు చంద్రిక, అప్పన రజని, బొండాడ సౌమ్య, ఆర్యవైశ్య సంఘ మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

జ్వరంతో యువకుడి మృతి



అనకాపల్లి పైడికొండ (ఫైల్)

ప్రత్తిపాడు రూరల్: ధర్మవరంలో యువకుడు గురువారం జ్వరంతో మృతి చెందాడు. స్థానిక జగనన్న కాలనీకి చెందిన అనకాపల్లి పైడికొండ(19) గత పది రోజులుగా జ్వరంతో బాధపడుతున్నాడు. గురువారం తీవ్ర అస్వస్థతకు గురై మృతి చెందాడు. మృతుడికి తల్లి, సోదరుడు ఉన్నారు.

భువనేశ్వరి పీఠంలో శరన్నవరాత్రులకు ఏర్పాట్లు

పెద్దాపురం: దేవి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని స్థానిక వర్జుల వారి వీధిలోని భువనేశ్వరి పీఠంలో ఏర్పాట్లు ముమ్మరం చేశారు. పీఠాధిపతి చింతా గోపిశర్మ సిద్ధాంతి ఆధ్వర్యంలో శరన్నవరాత్రి ఉత్సవాల ఏర్పాట్లకు సన్నహాలను పూర్తి చేశారు. ఈ సందర్భంగా గురువారం ఆయన ఇక్కడి విలేకర్లతో మాట్లాడుతూ, వచ్చే నెల మూడో తేదీ నుంచి 12వ తేదీ వరకు నిర్వహించే దేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం రాట ముహూర్తం చేయనున్నామన్నారు. ఉదయం 9.23కు వేముల సత్యసాయిప్రసాద్, అరుణ దంపతులు పాల్గొని రాట ముహూర్తం చేస్తారన్నారు. గత 25 ఏళ్లుగా భువనేశ్వరి పీఠంలో దేవి నవరాత్రులను నిర్వహిస్తున్నట్టు వివరించారు. నవరాత్రుల్లో అమ్మవారికి ప్రతి రోజూ అభిషేక, సహస్రనామ, కుంకుమ పూజలు, చండీ పారాయణం, హోమం నిర్వహిస్తారని తెలిపారు. ప్రత్యక్ష, పరోక్ష పద్ధతిలో అమ్మవారికి పూజలుంటాయని తెలిపారు. దేవి మాల ధరించే భక్తులు ముందుగా సంప్రందించాలని కోరారు.

ఫుల్ పామ్‌తో సాగుతూ..

- విస్తరిస్తున్న తోటలు
- రైతులకు ప్రోత్సాహకాలు



డి.పోలవరంలో పతంజలి సంస్థ నర్సరీలో ఆయిల్‌పామ్ మొక్కలు

తుని రూరల్: వాణిజ్య పంటలలో ఆయిల్‌పామ్ సాగు మంచి పామ్‌లో కొనసాగుతోంది. దేశీయంగా వంట నూనె ఉత్పత్తికి, విదేశీ మారకద్రవ్యం ఆదాకు, సాగుదారులు నికర ఆదాయం పొందేందుకు ఆయిల్‌పామ్ తోటల సాగు ఉపయోకరంగా ఉంది. సాగు విస్తరణకు ప్రభుత్వాలు రైతులకు ప్రోత్సాహకాలను అందిస్తున్నాయి. ఉద్యానశాఖ తుని సబ్‌డివిజన్ పరిధిలో ఇప్పటికే 1,455 హెక్టార్లు ఉండగా ఈ సంవత్సరం మరో 300 హెక్టార్లలో సాగు విస్తరించేందుకు అధికారులు ప్రణాళిక అమలు చేస్తున్నట్టు ఉద్యాన అధికారి జి.విజయలక్ష్మి తెలిపారు. మొక్కలు, ఎరువులకు రాయితీలు అందిస్తున్నామన్నారు.

రాయితీలిలా..

సన్న చిన్నకారు రైతులకు వందశాతం రాయితీపై మొక్కలను అందిస్తున్నారు. నాలుగేళ్ల తోటల నిర్వహణలో భాగంగా సంవత్సరానికి ఎరువుల నిమిత్తం రూ.5,250 చొప్పున రూ.21వేలు రాయితీ లభించనుంది. నాలుగేళ్లకు ఫలసాయం అందే వరకూ అంతర పంటలు సాగు చేసుకుంటే అదనపు ఆదాయం పొందవచ్చు. అంతర పంటలుగా పూల తోటలు, కూరగాయలు పంటల పెంపకాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం రాయితీలు అందిస్తోంది. రైతులు విత్తనాలు కొనుగోలు చేసుకుని బిల్లులు అందజేస్తే రూ.5,250 చొప్పున నాలుగేళ్ల ప్రోత్సాహకాలు పొందవచ్చు.



కొలిమేరులో ఆయిల్‌పామ్ తోట

దిగుబడి ఇలా..

నాలుగేళ్ల నుంచి 30 సంవత్సరాలు వరకూ ఆయిల్‌పామ్ తోటల నుంచి ఫలసాయం లభిస్తుంది. ఆయిల్‌పామ్ గెలలను పెద్దాపురం సమీపంలో ఉన్న పతంజలి సంస్థ కొనుగోలు చేస్తుంది. ఎకరాకు పది నుంచి 12 మెట్రిక్ టన్నుల గెలలు దిగుబడి లభిస్తుంది. ప్రస్తుతం మెట్రిక్ టన్ను ఆయిల్‌పామ్ గెలలు ధర రూ.14వేలు పలుకుతోంది. సంవత్సరంలో రూ.1.50 లక్షల వరకూ ఆదాయం లభించనుంది. నిర్వహణ, గెలలు సేకరణకు ఖర్చులు రూ.40వేల నుంచి రూ.50వేలు అయినా నికరంగా రూ.లక్ష వరకూ పొందవచ్చని అధికారులు పేర్కొన్నారు.

మార్కెట్ సదుపాయం



ఆయిల్‌పామ్ సాగుతో రైతులకు బహుళ ప్రయోజనాలు చేకూరుతాయి. పతంజలి సంస్థ నర్సరీ నుంచి ఉచితంగా ఆయిల్‌పామ్ మొక్కలు పొందవచ్చు. నాలుగేళ్ల ఎరువులు రాయితీల లభిస్తుంది. అంతర పంటలతో అదనపు ఆదాయం సమకూరుతుంది. నికరంగా ఆదాయం లభిస్తుంది. మార్కెట్ సదుపాయం లేదనే భయపడాల్సిన అవసరం లేకుండా పతంజలి సంస్థ ఆయిల్‌పామ్ గెలలను కొనుగోలు చేస్తుంది. కొనుగోలు చేసిన గెలలకు ఆన్‌లైన్ ద్వారా రైతుల బ్యాంకు ఖాతాలకు డబ్బు జమ చేస్తుంది.

– జి.విజయలక్ష్మి, హెచ్ఓ, తుని

స్వర్ణకిరీటానికి గ్రామోత్సవం



గాదెలపాలెంలో స్వర్ణ కిరీటానికి ఊరేగిస్తున్న దాత కంబాల శ్రీనివాస్‌రావు, భక్తులు

గోకవరం: గ్రామంలోని దేవీచౌక్ ఆలయంలో కొలువై ఉన్న శ్రీకనకదుర్గమ్మకు రూ.21 లక్షలతో చేయించిన నవరత్న ఖచిత స్వర్ణకిరీటాన్ని గురువారం మండలంలోని పలు గ్రామాల్లో గ్రామోత్సవం నిర్వహించారు. మండలంలోని తంటికొండ, గాదెలపాలెం, ఇటికాయలపల్లి, గోపాలపురం, కృష్ణునిపాలెం, వెంకటాపురం, రామన్నపాలెం, చిన్నూరు, రాజుపాలెం, ఆర్అండ్ఆర్ కాలనీలతో పాటు దేవీపట్నం మండలంలోని పలు గ్రామాల్లో దాత కంబాల శ్రీనివాస్‌రావు అమ్మవారి స్వర్ణ కిరీటాన్ని తలపై పెట్టుకుని ఊరేగించారు. ఆయా గ్రామాల్లోని భక్తులు కిరీటానికి హారతులు ఇచ్చి బ్రహ్మరథం పట్టారు.

ఈ కార్యక్రమంలో విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన సభ్యులు మామిడి అయ్యప్ప, ఇనకోటి బాపన్నదొర, తామర్ల రాంబాబు, వరసాల ప్రసాద్, డాక్టర్ వల్లూరి జగన్నాధశర్మ తదితరులు పాల్గొన్నారు.

కొండచిలువ హతం



కొండచిలువను హతమర్చిన గ్రామస్తులు

కిర్లంపూడి: వలకు చిక్కుకున్న 10 అడుగుల కొండచిలువను గ్రామస్తులు హతమర్చారు. రామచంద్రపురం ఏలేరు కాలువ గట్టుపై అదే గ్రామానికి చెందిన వ్యక్తి పెరట్లోకి గురువారం భారీ కొండచిలువ రావడంతో గ్రామస్తులు భయాందోళనకు గురైయ్యారు. పెరటిలో కూరగాయల వేసిన రక్షణ వలలో కొండచిలువ తల చిక్కుకోవడంతో ఎటూ వెళ్లలేక ఉండిపోయింది. దాంతో దానిని కర్రతో కొట్టి చంపేశారు.

ఆసుపత్రిలో వృద్ధుడి మృతి



మృతి చెందిన వృద్ధుడు

తుని: స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ వృద్ధుడు మృతి చెందాడని తుని పట్టణ సీఐ గీతా రామకృష్ణ తెలిపారు. ఈ నెల 24న అనారోగ్యంతో ఏరియా ఆసుపత్రిలో చేరాడు. కేర్ షీట్‌లో పశ్చిమ గోదావరి జిల్లా ఏలూరుకు చెందిన దొడ్డిపాక శ్రీనుగా నమోదు చేశారు. చికిత్స పొందుతూ గురువారం మరణించాడు. మృతుడికి సంబంధించి వివరాలు తెలిస్తే పట్టణ పోలీసులకు సమాచారం అందజేయాలని సీఐ రామకృష్ణ కోరారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి



మెప్మా మార్కెట్‌లో కొనుగోలు చేస్తున్న మహిళలు

ఏలేశ్వరం: మహిళలకు ఆర్థికంగా ఎదిగేందుకు మెప్మా చేయూత ఇవ్వాలని టీఎంసీ సాయికుమార్ అన్నారు. స్థానిక మెయిన్‌రోడ్‌ను ఆనుకుని గురువారం మెప్మా(పట్టణ నిర్మూలన సంస్థ) ఆధ్వర్యంలో మెప్మా అర్బన్ మార్కెట్ ఏర్పాటు చేశారు. డ్వాక్రా సంఘాల సభ్యులు తయారు చేసిన బట్టలు, వెదురుబుట్టలు, స్నాక్స్, పినాయిల్, తదితర వస్తువులు మెప్మా మార్కెట్‌లో అమ్మకాలు చేశారు. ఈ సందర్భంగా టీఎంసీ మాట్లాడుతూ డ్వాక్రా మహిళలకు ఆర్థిక భరోసా ఇచ్చేందుకు మెప్మా కృషి చేస్తుందన్నారు. ప్రతినెలా మార్కెట్ ఏర్పాటు చేశారు. డ్వాక్రా మహిళలు మార్కెట్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

గౌరీ అమ్మవారి పీట ఊరేగింపు



అమ్మవారి పీటను ఊరేగిస్తున్న భక్తులు

కిర్లంపూడి: గౌరీ అమ్మవారి పీట ఊరేగింపు ఉత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. జగపతినగరంలో గౌరీ శంకరుల ఆలయం వద్ద నిర్వహించే గౌరీ దేవి ప్రతిమ తయారీకి గ్రామ పెద్దలు ముహూర్తం ఖరారు చేశారు. దీనిలో భాగంగా అమ్మవారి పీటకు ప్రత్యేక పూజలు నిర్వహించి, గ్రామంలో ఊరేగించారు. ఈకార్యక్రమంలో కర్రి సూర్యప్రసాద్, ఆళ్ల బాబులు, ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి మల్లికార్జునరావు

ఏలేశ్వరం: ప్రభుత్వ లేఅవుట్లల్లో ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తిచేయాలని మండల ప్రత్యేకాధికారి ఎం.మల్లికార్జునరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీడీఓ జె.శ్రీనివాస్ అధ్యక్షతన ఇళ్ల నిర్మాణాలపై సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ప్రత్యేకాధికారి మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణాల నిమిత్తం గ్రామాలకు ప్రత్యేకాధికారులను నియమించారన్నారు. లేఅవుట్లలో ఇళ్లనిర్మాణాలను లబ్ధిదారులు పూర్తిచేయాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ అబ్బాయి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ధర్మవరంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం



ధర్మవరంలో నిర్వహిస్తున్న అవగాహన ర్యాలీ

ప్రత్తిపాడు రూరల్: ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని నేషనల్ హైవే అథారిటీ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి మన ఊరు- మన ఇల్లు, పరిసరాల పరిశుభ్రత అనే అంశంపై అవగాహన కల్పిస్తూ గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. నేషనల్ హైవే అథారిటీ అధికారులు, సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చిరు వ్యాపారులకు వాన దెబ్బ

- వర్షంలో సాగని వ్యాపారాలు
- తడుస్తూనే బేరం కోసం ఎదురుచూపులు



ప్రత్తిపాడు వారపు సంతలో చిరు వ్యాపారులు, కొనుగోలుదారుల ఇబ్బందులు

ప్రత్తిపాడు: కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలు చిరు వ్యాపారులకు ఇబ్బందులు తెచ్చిపెట్టాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు వర్షంలో తడుస్తూనే కొనుగోలుదారుల ఎదురుచూడక తప్పడం లేదనీ వారపు సంత చిరువ్యాపారులు, తోపుడు బళ్ల వ్యాపారులు పేర్కొంటున్నారు. ప్రత్తిపాడు వారపు సంత ప్రతి వారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ బిజీ కొనసాగుతుంది. ఈ సంతకు దూర ప్రాంతాల నుంచి చిరువ్యాపారులు, ప్రత్తిపాడు గ్రామంలో పాటు సమీప గ్రామాలైన ఏలూరు, టి.రాయవరం, లంపకలోవ, పి.జగన్నాథపురం గ్రామాల నుంచి కొనుగోలుకు ఇక్కడకే వస్తుంటారు. అయితే ఇటీవల కురిసిన వర్షాల కారణంగా ప్రజలు బయటకు రాకపోవడంతో తమకు బేరం లేక పస్తులు ఉండాల్సి వస్తోందని వాపోతున్నారు. చిరు వ్యాపారాలు చేసుకునేందుకు కనీసం షెడ్లు కానీ, తాగునీరు వంటి వసతులను కానీ పంచాయతీ అధికారులు ఏర్పాటు చేయలేదు. ఇప్పటికైనా వారపు సంతకు ఎండా వానల నుంచి రక్షణగా షెడ్లు నిర్మించాలని, వసతులను మెరుగుపర్చాలని చిరు వ్యాపారులు, గ్రామ ప్రజలు కోరుతున్నారు.

విజయవాడకు రత్నగిరి సిబ్బంది

అన్నవరం: విజయవాడలోని శ్రీదుర్గా మల్లేశ్వర స్వామివారి దేవస్థానం (దుర్గగుడి)లో వచ్చే నెల మూడో తేదీ నుంచి 12వ తేదీ వరకూ జరుగనున్న 'దసరా' మహోత్సవాలకు అన్నవరం దేవస్థానానికి చెందిన 22 మంది సిబ్బందిని డిప్యుటేషన్‌పై నియమించారు. ఈ మేరకు దేవస్థానం ఈఓ కె.రామచంద్రమోహన్ గురువారం ఆదేశాలు జారీ చేశారు. ఈ విధంగా నియమించిన వారిలో సూపరింటిండెంట్‌తో సహా వివిధ క్యాడర్‌కు చెందిన సిబ్బంది ఉన్నారు. వీరు వచ్చే నెల రెండో తేదీన విజయవాడ దేవస్థానంలో రిపోర్టు చేయాలి.

30న సత్యదేవుని హుండీ ఆదాయం లెక్కింపు



అన్నవరం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరంలోని శ్రీవీరవేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో హుండీ ఆదాయాన్ని ఈ నెల 30వ తేదీన లెక్కించనున్నారు. ఈ విషయాన్ని దేవస్థానం డిప్యూటీ కమిషనర్ ఎస్.చంద్రశేఖర్ తెలియజేశారు. ఈ నెల రెండో తేదీన స్వామివారి హుండీ ఆదాయాన్ని లెక్కించారు. మళ్లీ 28 రోజుల తరువాత హుండీ ఆదాయం లెక్కించనున్నారు. దేవస్థానంలోని సిబ్బంది అందరూ తప్పక హుండీ లెక్కింపు కార్యక్రమానికి హాజరు కావాలని ఆయన ఆదేశించారు.

ఎండు తెగులు నివారణపై అవగాహన



పొలంబడి కార్యక్రమంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ

గండేపల్లి: వరి పంటలో ఎండు తెగులు నివారణపై ఏఓ సద్గురుమూర్తి గురువారం రైతులకు అవగాహన కల్పించారు. గండేపల్లిలో గురువారం వ్యవసాయ పద్ధతులు-పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఎండ, వర్షతో కూడిన వాతావరణం రిత్యా ఆకు ఎండు తెగులు ఉధృతి ఎక్కువగా ఉందన్నారు. దీని ప్రభావం నీడ ఉన్న ప్రాంతంలో ఈ తెగులు ఎక్కువగా ఉంటుందని, దీని నివారణకు నీరు తీసేసి మరలా నీరు పెట్టుకుని 20 కేజీల పోటాష్ చల్లుకోవాలన్నారు. కేజీ సూడోమోనాస్ వంద లీటర్ల నీటిలో కలిపి చల్లడం ద్వారా మెరుగైన ఫలితాలు ఉంటాయన్నారు. సూడోమోనాస్ చల్లినప్పుడు వారం రోజుల పాటు ఎటువంటి రసాయనిక ఎరువులు, పురుగు, తెగులు మందులు వాడకూడదన్నారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో ఈ-పంట, ఈ-కేవైసీ నమోదుకు ఈనెల 30 వరకు గడువు ఉందని, అర్హులైన రైతులు రైతు సేవా కేంద్రాలను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది భాస్కరరావు, రమ్య, వీఏఏ అంజలి, రైతులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి యోగా పోటీలకు శ్రీప్రకాష్ విద్యార్థులు



జాతీయ స్థాయి యోగా పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న నరసింహారావు

తుని: జాతీయ స్థాయి యోగా పోటీలకు శ్రీప్రకాష్ విద్యార్థులు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ మూర్తి గురువారం తెలిపారు. ఈ నెల 21వ తేదీ నుంచి 23 వరకూ తమిళనాడు రాష్ట్రం చెంగల్ పేట్ శ్రీగోకులం పబ్లిక్ స్కూల్‌లో సౌత్ జోన్ యోగా పోటీలు జరిగాయి. ఇందులో శ్రీప్రకాష్‌కు చెందిన విద్యార్థులు బి.దేవాన్ష్ నాయుడు, జి.సోమసూర్య చరణ్, పి.సోహన్, సీహెచ్ జయదీప్, వి.చైతన్య అండర్-17 బాలుర గ్రూపులో ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకాలను సాధించారన్నారు. దీంతో వచ్చే నెల 2వ తేదీ నుంచి 5వ తేదీ వరకూ గుజరాత్ రాష్ట్రం సూరత్‌లోని ఎల్‌పీ సవాని అకాడమిలో జరిగే జాతీయ స్థాయి యోగా పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. విద్యార్థులను విద్యాసంస్థల అధినేత సీహెచ్‌వీకే నరసింహారావు, సంయుక్త కార్యదర్శి విజయ్‌ప్రకాష్, యోగా గురువులు సురేష్, జయంతి, ఉపాధ్యాయులు అభినందించారు.

పంచాయతీ కార్యదర్శులకు బదిలీలు

ప్రత్తిపాడు: పంచాయతీ కార్యదర్శులను బదిలీ చేస్తూ జిల్లా కలెక్టర్ సగిలి షాన్మోహన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇరువురు కార్యదర్శులు మండలంలోనే అంతర్గత బదిలీలు కాగా ఒకరు ఇతర మండలానికి బదిలీ అయ్యారు. మరో నలుగురు ఇతర మండలాల నుంచి ఈ మండలానికి బదిలీ అయ్యారు. అయితే అక్టోబర్ మూడు నుంచి అమలులోకి వస్తాయని ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్‌బాబు తెలిపారు. మండలంలో ఏలూరు, చింతలూరు గ్రామ కార్యదర్శులు బి.కామరాజు, బి.సుబ్రహ్మణ్యంలను ఇదే మండలంలోని ధర్మవరం, ఉత్తరకంచి పంచాయతీలకు బదిలీ చేశారు. చినశంకర్లపూడి గ్రామ కార్యదర్శి సుబ్బారావును రౌతులపూడి మండలం లచ్చిరెడ్డిపాలెం పంచాయతీకి బదిలీ చేశారు. కాగా కృష్ణా జిల్లా నుంచి ఎం.లక్ష్మీనారాయణను రాచపల్లి పంచాయతీకి, గొల్లప్రోలు మండలం ఏకే మల్లవరం కార్యదర్శి బి.నాగమణిని పోతులూరుకు, పెద్దాపురం మండలం వి.తిమ్మాపురం కార్యదర్శి వి.శ్రీనివాసరావును చింతలూరుకు, అడ్డతీగల మండలం ఎల్లవరం కార్యదర్శి కె.నాగరాజును శరభవరం గ్రామ పంచాయతీకి బదిలీ చేసినట్టు ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్‌బాబు తెలిపారు.

కుండపోత వర్షం



ప్రత్తిపాడు పంచాయతీ వెనుక వీధిలో రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

తొండంగి: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి ప్రభావంతో గురువారం మండలంలో కుండపోత వర్షం కురిసింది. పల్లపు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. ఉదయం నుంచి మాగుడు వాతావరణంతో ఆకాశం మేఘావృతమైంది. మధ్యాహ్నం నుంచి ఏకదాటిగా రెండు గంటలపాటు కుండపోత వర్షం కురిసింది. దీంతో తీరప్రాంత, మెట్ట గ్రామాల్లో సైతం పల్లపు వీధులన్నీ జలమయమయ్యాయి. ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షంతో ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బంది పడ్డారు. పంటలు మళ్లీ ముంపుబారిన పడతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

ప్రత్తిపాడులో..

ప్రత్తిపాడు: మండలవ్యాప్తంగా ఓ మోస్తరు వర్షం కురిసింది. 8.6 మిల్లీ లీటర్ల వర్షపాతం నమోదైంది. పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. గ్రామాల్లో డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడం వల్ల పలు చోట్ల రోడ్లనే వర్షం నీరు తిష్టవేసింది. మెట్ట పంటలను, పండ్ల తోటలు, కూరగాయల పంటలకు వర్షం మేలు చేసిందని రైతులు చెబుతున్నారు.

తుప్పలు తొలగించండి



రాజపూడి నుంచి మన్యవారిపాలెం వెళ్లే రోడ్డులో పెరిగిపోయిన తుప్పలు

జగ్గంపేట: మండలంలోని రాజపూడి నుంచి మన్యవారిపాలెం వెళ్లే రహదారిలో పిచ్చి మొక్కలు, తుప్పలు పెరిగిపోయాయి. ఈ తుప్పలు కారణంగా రోడ్డు మూసుకుపోయి ఎదురుగా వచ్చే వాహనాలకు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. గతంలో తుప్పలను ఎన్ఆర్‌జీఎస్‌లో తొలగించారని, ప్రస్తుతం ఈ పనులతో వారి సబంధంలేదని ఎన్ఆర్‌జీఎస్ అధికారులు చెపుతున్నారని గ్రామ మాజీ సర్పంచి కేశినీడి రాజేశ్వరరావు తెలిపారు. చాలా చోట్ల ఉపాధి కూలీలు తుప్పలు తొలగిస్తున్నారని ఆయన చెప్పారు. మండల అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తుప్పలు తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కూటమిలో బయటపడిన వర్గ విభేదాలు

శంఖవరం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన మంచి ప్రభుత్వం కార్యక్రమంలో వర్గ విభేదాలు బయటపడ్డాయి. గురువారం మండలంలోని మండపం గ్రామంలో స్థానిక ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ఆధ్వర్యంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశానికి స్థానిక కూటమి నేతలు హాజరయ్యారు. అయితే వారిలో స్థానిక జనసేన నేత పాలం వెంకటరత్నాన్ని స్టేజ్ మీదకు ఆహ్వానించాలని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి వరుపుల తమ్మయ్యబాబు కొరగా టీడీపీ నేతలు అభ్యంతరం వ్యక్తం చేశాడు. జనసేన కార్యకర్తలను ఆహ్వానించకపోవడంతో కూటమిలో మాకు విలువ లేదంటూ స్టేజ్ మీద ఉన్న వరుపుల తమ్మయ్యబాబు దిగిపోయారు. దీంతో ఒక్కసారిగా కూటమిలో విభేదాలు బయటపడ్డాయి. కూటమి నేతలు తమ పార్టీ నేతలపై దురుసుగా ప్రవర్తిస్తే సహించేది లేదని టీడీపీ నాయకులు అన్నారు. తమ్మయ్యబాబుకు టీడీపీ నేతలు సర్ది చెప్పే ప్రయత్నం చేశారు. అయినప్పటికీ జనసేన నాయకులు, కార్యకర్తలు అక్కడ నుంచి వెళ్లిపోయారు.

ఇంటి వద్దకే తపాలా సేవలు



పోస్టల్ శాఖ పథకాలపై అవగాహన కల్పిస్తున్న తాతూనాయుడు

రంపచోడవరం సబ్ డివిజనల్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ చందక తాతూనాయుడు

గోకవరం: తపాలా శాఖ సేవలను ఇంటి వద్దకే అందించనున్నట్టు రంపచోడవరం సబ్‌డివిజనల్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ చందక తాతూనాయుడు తెలిపారు. పెంటపల్లి గ్రామంలో స్థానిక రామాలయంలో తపాలా శాఖ ఆధ్వర్యంలో గురువారం దాక్ చౌపాల్ అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ తపాలా శాఖ అందించే వివిధ రకాల చిన్నమొత్తాల పొదుపు పథకాలను, జీవిత బీమా పాలసీలను ఇంటి వద్దకే అందిస్తామని అన్నారు. అలాగే పోస్టల్ శాఖ అందిస్తున్న పలు సేవలను వివరించి ప్రజలంతా ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పోస్టల్ సిబ్బంది సురేష్, సూర్య, గ్రామస్తులు పాల్గొన్నారు.